క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో కాలాష్టమి

కడప కల్చరల్ : కడప నగర సమీపంలోని ఎంఎస్ కొట్టాల గ్రామంలో గురువారం శ్రీ ఇష్టకామ్యార్థ కాలభైరవస్వామి ఆలయంలో కాలాష్టమి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు శ్రీధరశర్మ తొలుత స్వామికి ప్రాతఃకాల పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో హాజరైన భక్తులతో అర్చకులు కూష్మాండ దీప సేవ నిర్వహించారు. అనంతరం భక్తులందరికీ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు. బాసట స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు బాలాజీరావు తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ పవిత్ర మాసం

కడప వైఎస్ఆర్ సర్కిల్: రంజాన్ ఎంతో పవిత్రమైన మాసం అని ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఎన్. రవిశంకర్ రెడ్డి అన్నారు. గురువారం నగరంలోని ఆప్‌కీ ఆవాజ్ కార్యాలయంలో రాయలసీమ మహిళా సంఘం ఆధ్వర్యంలో పేద ముస్లిం మైనార్టీ ప్రజలకు రంజాన్ కిట్‌ను అందజేశారు. ఆర్‌సీపీ పార్టీ ప్రజా సమస్యలపై పోరాటాలు కాకుండా ఇలాంటి పవిత్ర పండుగలో పేదవారికి సహాయం చేయడంలోనూ ముందుంటుదన్నారు. సంఘ సేవకులు సల్లావుద్దీన్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎస్టీ కమిషన్ చైర్మన్ దృష్టికి గిరిజన సమస్యలు

కడప కార్పొరేషన్: జిల్లాలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎస్టీ కమిషన్ చైర్మెన్ కుంభా రవిబాబు దృష్టికి తీసుకుపోయినట్లు వైఎస్సార్‌సీపీ ఎస్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు బి. వేణుగోపాల్ నాయక్ తెలిపారు. గురువారం విజయవాడలో ఆయన్ను కలిసి వినతిపత్రమిచ్చామన్నారు. గిరిజనుల జనాభాను సక్రమంగా లెక్కించి నిధులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ డాక్టర్ విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శివా నాయక్ పాల్గొన్నారు.

నిరాశ్రయుల వసతి గృహం పరిశీలన

కడప కోటిరెడ్డిసర్కిల్: ప్రకాశ్‌నగర్‌లోని స్నేహాలయ నిరాశ్రయుల వసతి గృహాన్ని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కవిత గురువారం పరిశీలించారు. అనంతరం న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేసి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనాథలు, అభాగ్యుల కోసం ఉచిత నిరాశ్రయుల వసతి గృహాలు ఏర్పాటు చేశారన్నారు. ఇక్కడ ఉంటున్న వృద్ధులు పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం సీనియర్ సిటిజన్ టోల్ ఫ్రీ నెంబరు 14567పై అవగాహన కల్పించారు.

కేఎస్ఆర్ఎంలో ఘనంగా రాష్ట్రస్థాయి ఫెస్ట్



సమావేశంలో మాట్లాడుతున్న కళాశాల పూర్వపు విద్యార్థి రాజమండ్రి డీఎస్పీ శ్రీలత

కడప ఎడ్యుకేషన్: కడప నగర శివార్లలోని కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం శివానంద స్మరణం రాష్ట్రస్థాయి ఫెస్ట్ కనెక్ట్-2కే23 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ ఫెస్ట్‌కు రాష్ట్రవ్యాప్తంగా వివిధ కళాశాలల నుంచి విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల పూర్వ విద్యార్థి రాజమండ్రి డీఎస్పీ శ్రీలత హాజరై మాట్లాడుతూ నాలుగేళ్ల ఇంజనీరింగ్ విద్యలో సమాజానికి ఉపయోగపడే విధంగా విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. కృషి పట్టుదల ఉంటే సాధించలేదంటూ ఏదీ ఉండదన్నారు. పటిష్ట ప్రణాళికతో లక్ష్యాన్ని చేరుకోవాలని విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పత్ర సమర్పణ, ప్రాజెక్టు పోక్స్‌పో, పేపర్ ప్రెజెంటేషన్‌లకు విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రెసిడెంట్ కందుల మదన్‌మోహన్‌రెడ్డి, కరస్పాండెంట్ కందుల రాజేశ్వరి, మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి, కళాశాల ప్రధానాచార్యులు వీఎస్ఎస్‌మూర్తి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సహస్ర దీపాలంకార సేవ



అమ్మవారికి హారతి ఇస్తున్న అర్చకుడు

కడప కల్చరల్: కడప నగరం హనుమప్పవీధిలోని శ్రీ నడివీధి గంగమ్మ క్షేత్రం బ్రహ్మోత్సవాల ముగింపు గురువారం జరిగింది. ఇందులో భాగంగా నిర్వాహకులు గోపాల్‌సింగ్, గౌరీభాయి దంపతులు తొలి దీపం వెలిగించి కనుల పండువగా అలంకరించిన పీఠంపై అమ్మవారిని కొలువుదీర్చారు. హాజరైన మహిళా భక్తులంతా వారికి వీలైనన్ని దీపాలు వెలిగించి సహస్ర దీపాలంకార సేవ నిర్వహణలో తోడ్పడ్డారు. అనంతరం అమ్మవారికి విశేషంగా అలంకరించిన ఊయలలో శయనింపు సేవను నిర్వహించారు. ఊయలలోని అమ్మవారిని ఆహ్లాదం కలిగేలా భక్తులు భక్తిగీతాలను ఆలపించారు. భక్తులు సమర్పించిన వడి బియ్యంతో అన్నదానం నిర్వహించారు.

ఆ ముగ్గురు.. దేశాభివృద్ధి నిర్మాతలు

- అంబేద్కర్, పూలే, జగజ్జీవన్‌రామ్‌లపై ప్రత్యేక సదస్సులో వీసీ

వైవీయూ : భారతదేశ అభివృద్ధికి, సంస్కరణలకు బాటలు వేసిన గొప్ప సంఘసంస్కర్తలు, నిర్మాతలు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, జ్యోతిరావుపూలే, బాబూ జగజ్జీవన్‌రామ్‌లు అని వైవీయూ వీసీ జింక రంగజనార్దన పేర్కొన్నారు. వైవీయూలోని ఆర్ట్స్‌అండ్ హ్యూమానిటీస్ బ్లాక్‌లోని సురభి సమావేశ మందిరంలో అంబేద్కర్, జ్యోతిరావుపూలే, బాబూజగజ్జీవన్‌రామ్‌ల జయంతి వేడుకలను ప్రత్యేక సదస్సు సమాన అవకాశాల డైరెక్టర్ డా. ఎం.ఎం. వినోదిని ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గురు మహనీయులకు అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషిచేసిన ముగ్గురు మహనీయుల జయంతోత్సవాలు ఒకే నెలలో రావడం విశేషమన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ పూలే, అంబేద్కర్, జగజ్జీవన్ రామ్ బడుగు, బలహీన వర్గాల్లో చైతన్యం తీసుకువచ్చిన గొప్ప సంస్కర్తలు అని కొనియాడారు. ప్రిన్సిపాల్ ఆచార్య కె. కృష్ణారెడ్డి , విశిష్ట అతిథి కరీంనగర్ శాతవాహన విశ్వవిద్యాలయం డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ఆచార్య సూరేపల్లి సుజాత , సతీష్‌బాబు మాట్లాడారు. అనంతరం ఆర్ట్స్ డీన్ ఆచార్య టి. రామప్రసాద్‌రెడ్డి, ఆచార్య ఏజీ దాము, ఆచార్య పి.ఎస్. షావల్లీఖాన్, ఆచార్య కె. గంగయ్య డా. ఎస్.వి. కృష్ణారావు, తదితరులు మాట్లాడారు. ఆచార్య ఏజీ దాము ఆయన సతీమణి ఆర్థికసాయంతో విశ్వవిద్యాలయంకు 10 రాజ్యాంగ గ్రంథాలను బహుకరించారు. అధ్యాపకులు గణేష్‌నాయక్, మమతకుమారి, వరప్రభాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైవీయూ వీసీ ఆచార్యరంగజనార్ధన



ఏఎఫ్‌యూలో అంబేద్కర్ జయంతి వేడుకల్లో వీసీ తదితరులు

ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి ముందస్తు వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయంలోని డా.బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి వీసీ ఆచార్య జింక రంగజనార్ధన తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నేడు అంబేద్కర్ జయంతి సభ

కడప కల్చరల్ : అంబేద్కర్ జయంతి సభను శుక్రవారం నిర్వహించనున్నామని అంబేద్కర్ మిషన్ ఆర్గనైజింగ్ సభ్యులు లెనిన్ ప్రసాద్, కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం విశ్వనాథపురంలో ప్రత్యేకంగా సభ నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ సభకు అంబేద్కర్ ధర్మపోరాట సమితి వ్యవస్థాపకులు ఇంగిలాల రామచంద్రరావు, వైవీయూ ఆచార్యులు దాము తదితరులు హాజరై ప్రసంగిస్తారని తెలిపారు.

డా. వైఎస్ఆర్ ఏఎఫ్‌యూలో.. డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి వీసీ ఆంజనేయప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆన్‌లైన్ క్విజ్ ప్రారంభం

వైవీయూ: అంబేద్కర్ జయంతి వేడుకల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ పురుషుల కళాశాల రాజనీతిశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో గురువారం ఆన్‌లైన్ క్విజ్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ ల్యాప్‌టాప్ ద్వారా ప్రారంభించారు. అధ్యాపకులు వై. సావిత్రి, ఆర్. నీలయ్య, చక్రవర్తి, శివరాం, రవిశేఖర్ పాల్గొన్నారు.

నేడు జైభీమ్ వాక్

కడప రూరల్: అంబేద్కర్ జయంతి సందర్భంగా శుక్రవారం జైబీమ్ వాక్ నిర్వహించనున్నట్లు ఆలిండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రామ్మూర్తి నాయక్ తెలిపారు. ఉదయం 7 గంటలకు కోటిరెడ్డిసర్కిల్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు కార్యక్రమం ఉంటుందని వివరించారు.

'జగనన్నే మా భవిష్యత్'కి విశేష స్పందన

కడప కార్పొరేషన్: కడప నగరంలో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమానికి అద్భుత స్పందన లభిస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా ఇళ్ల వద్దకు వెళుతున్న కార్పొరేటర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో 'మా నమ్మకం నువ్వే జగన్' అంటూ ప్రజలు నినదిస్తున్నారు. స్థానిక 13 డివిజన్లోని అరవిందనగర్‌లో కార్పొరేటర్ ఎం. రామలక్ష్మణ్‌రెడ్డి ఆధ్వర్యంలో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పనితీరును తెలుసుకొని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలని కోరారు.

- కడప నగరంలోని 20 డివిజన్ మారుతీనగర్, ఏపీహెచ్‌బీ కాలనీలో కార్పొరేటర్ వై. మాధవి, డివిజన్ ఇన్‌చార్జి శ్రీరంజన్‌రెడ్డి ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించారు. ఇంటింటికీ స్టిక్కర్లు అతికించారు. వారి మొబైల్ నుంచి మిస్డ్‌కాల్ ఇప్పించారు.



13 డివిజన్‌లో సర్వే నిర్వహిస్తున్న కార్పొరేటర్ ఎం. రామలక్ష్మణ్‌రెడ్డి, కన్వీనర్లు, గృహసారథులు

- వైఎస్సార్ స్టూడెంట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పి. సాయిదత్త ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌వీసీకే కళాశాల యందు 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. యువతీ, యువకులతో మిస్డ్‌కాల్ ఇప్పించారు.విద్యార్థి విభాగం నాయకులు శివ, కార్తీక్, మహేష్, రామక్రిష్ణ పాల్గొన్నారు.

గోవులను గోశాలకు తరలించాలి

కడప కార్పొరేషన్: కడపనగరంలో వివిధ ప్రాంతాల్లోని గోవులన్నింటినీ వారం రోజుల్లోగా గోశాలకు తరలించాలని మున్సిపల్ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. గురువారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన పాత మార్కెట్, మాచుపల్లి బస్టాండు, జయనగర్ కాలనీ ప్రాంతాల్లో పర్యటించారు. పాత మార్కెట్‌లో ఉన్న రూములను తనిఖీ చేసి, కార్పొరేషన్‌కు సంబంధించిన స్థలాలను గుర్తించి కొలతలు వేయాలని సూచించారు. ప్రతి షాపునకు ఆస్తి పన్ను వేయాలని ఆదేశించారు. మార్కెట్‌లో ఉన్న కూరగాయల అంగళ్లు, మాంసపు దుకాణాల నుంచి వచ్చే వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మార్కెట్‌లోని గార్బేజ్ పాయింట్ వద్దనున్న వీధి దీపాల స్తంభాలు యథావిధిగా ఏర్పాటు చేయాలన్నారు. ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలు అమర్చాలన్నారు. మాచుపల్లి బస్టాండు వద్దనున్న ఖాళీ స్థలంలో చేపల మార్కెట్ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పాత చిన్నచౌకు పోలీస్‌స్టేషన్ స్థలంలో పార్కు లేదా మార్కెట్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. అనంతరం పాత రిమ్స్ ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. ఏసీపీ నాగేంద్ర, ఆర్ఓలు విజయ్ భాస్కర్ గౌడ్, కన్నయ్య, ఎంహెచ్ఓ ప్రశాంత్ వర్దన్, డీఈ వేణుగోపాల్ పాల్గొన్నారు.



పాత రిమ్స్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్, అధికారులు

బడి తెరిచిన రోజే విద్యా కానుక

- రాష్ట్ర పరిశీలకుడు అల్లం సత్యనారాయణ

కడప ఎడ్యుకేషన్: విద్యా సంవత్సరం ప్రారంభం సమయానికి ముందే విద్యార్థుల చేతికి జగనన్న విద్యాకానుక కిట్లు అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని జేవీకే రాష్ట్ర పరిశీలకుడు అల్లం సత్యనారాయణ పేర్కొన్నారు. గురువారం కడపలోని ఎమ్మార్సీలో ఎంఈఓ పాలెం నారాయణ ఆధ్వర్యంలో జేవీకే-4 ఏర్పాట్లు, భద్రతపై మండలస్థాయి కమిటీతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే మండలాల వారీగా స్టోరేజ్ పాయింట్లను గుర్తించామన్నారు. స్టోరేజ్ పాయింట్లకు వచ్చే వస్తువులను ఎప్పటికప్పుడు భద్రపరిచేలా ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. వర్షానికి ఎక్కడ కూడా జేవీకే కిట్లు తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమగ్రశిక్ష కమ్యూనిటి మొబిలైజేషన్ ఆఫీసర్ మిట్టా కేశవరెడ్డి, అసిస్టెంట్ కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ దశరథరామిరెడ్డి, ఎంఈఓ పాలెం నారాయణ, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు, ఐఈఆర్టీలు, ఎంఐఎస్, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేవీకే రాష్ట్ర పరిశీలకుడు అల్లం సత్యనారాయణ

ఘనంగా వసంతోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రామేశ్వరంలోని శ్రీ ముక్తిరామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం ఘనంగా వసంతోత్సవాన్ని నిర్వహించారు. తెల్లవారుజామున సైకత లింగానికి, రాజరాజేశ్వరి అమ్మవారికి, చండీమాతకు, ఆదిశంకరాచార్యులు ప్రతిష్ఠించిన శ్రీ చక్రానికి, ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు, అర్చనలు చేశారు. గంగా రాజరాజేశ్వరి సమేత ముక్తిరామలింగేశ్వర స్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి వాహనంపై కొలువు దీర్చి పురవీధుల్లో ఘనంగా వసంతోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు రంగులు రంగులు చల్లుకుంటూ ఆనందోత్సాహాలతో వసంతోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమానంతరం భక్తులకు తీర్థప్రసాద వినియోగం జరిగింది.



వసంతోత్సవంలో గంగారాజరాజేశ్వరి సమేత ముక్తిరామలింగేశ్వరుడు

భూసార పరీక్షల వల్ల అధిక మేలు

చెన్నూరు : రైతులు భూసార పరీక్షలు చేయించుకుంటే అధిక మేలు చేకూరుతుందని కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ టి.స్వామి చైతన్య తెలిపారు. గురువారం స్థానిక రైతు భరోసా కేంద్రం చెన్నూరు-2లో భూసార పరీక్ష, నేల పరిస్థితిపై మండలస్థాయిలో వ్యవసాయ సిబ్బందికి ఆయన వర్క్‌షాప్ నిర్వహించి మాట్లాడారు. మట్టి నమూనా తీసే విధానం గురించి తెలిపారు. ఎకరానికి 8 చోట్ల మట్టి నమూనా సేకరించాలని, వరి తదితర పంటలకు 15 సెంటీమీటర్లు లోతు వరకు, పత్తి, వాణిజ్య పంటలకు 30 సెంటీమీటర్లు లోతు వరకు, పండ్ల తోటలకు ఒకటి లేదా రెండు మీటర్ల లోతు వరకు మట్టి నమూనా సేకరించి పరీక్షకు పంపించాలని సూచించారు. అంతేకాకుండా నీటి పరీక్షకు బోరు నుంచి నీటిని సేకరించి అదేరోజు పరీక్షకు పంపించాలన్నారు. రైతు శిక్షణ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువుల వల్ల భూమికి కలిగే ప్రయోజనాలు తెలియజేశారు.

ప్రారంభమైన తాఖ్ రాత్‌లు

కడప కల్చరల్ : పవిత్ర రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు జోరందుకున్నాయి. ఇందులో భాగంగా ఇప్పటికే పవిత్ర తాఖ్‌రాత్‌లు ప్రారంభమయ్యాయి. పవిత్ర రంజాన్ మాసం చివరి పది రోజుల్లో నిర్వహించే «తలాషే షబ్బే ఖద్ర్» తాఖ్ రాత్‌ల కార్య క్రమంలో ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొని అల్లాహ్‌ను ప్రసన్నం చేసుకునేందుకు తమవంతుగా కృషి చేస్తారు. ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా కడప నగరంలోని దాదాపు అన్ని ప్రధాన మసీదుల్లో రాత్రి 11.30 నుంచి ప్రత్యేక ప్రార్థనలు జరుగుతున్నాయి. తాఖ్ రాత్‌లలో భాగంగా వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నారు. ఆధ్యాత్మిక రంగంలో విశేష అనుభవంగల ముఫ్తీలు, మౌల్వీలను పిలిపించి వారిచే పవిత్ర రంజాన్ మాసం విశిష్ఠత గురించి ప్రసంగాలు చేయిస్తున్నారు. తాఖ్ రాత్రుల్లో భాగంగా ఈనెల 12వ తేదిన తొలి తాఖ్‌రాత్‌ని భక్తిపూర్వకంగా నిర్వహించారు. అలాగే 14వ తేదిన రెండవ, 16న మూడవ, 18న నాల్గవ, 20న ఐదవ తాఖ్‌రాత్‌ను నిర్వహించనున్నారు. ఉపవాస దీక్ష ఉన్న వారి కోసం మసీదుల్లోనే తెల్లవారుజామున సెహారీ ఏర్పాట్లు కూడా చేస్తున్నారు.